**1984 రక్షాక్షి ఉగాది సస్పెన్స్ కథల పోటీలో మొదటిబహుమతి పొందిన కథ**

టైంచూసుకున్నాను- ఇంకా పది నిమిషాలలో రియాక్షన్ అయిపోతుంది. దాంతో ఈ రోజుకి పని పూర్తవుతుంది- ఈ రోజుకేకాదు- ఈ వారానికి- ఈ నెలకి- కూడా!

# యురేకా!

శ్రీఉదయిని

కిటికీలోంచి విసురుగా గాలివచ్చి జుట్టునంతా చిందరవందర చేసింది. జుట్టుని సవరించుకుని కిటికీలోంచి బయటికి చూశాను. మబ్బులు కమ్ముకుంటున్నాయి. ఆకాశం మేఘావృతమై చెదురుమదురుగా జల్లులో చిన్నపాటి వర్షమో పడితే పర్వాలేదుగాని కుంభవృష్టిగా మారితే....?! ఈ రాత్రికి నా ప్రయాణం ఆగిపోవచ్చు.... నా గుండె జల్లుమంది!

చాలా రోజులనుంచి ఎదురు చూస్తున్నాను మా ఊరు వెళ్ళాలని. దానికి తోడు వరుసగా నాలుగు రోజులు సెలవలు రావటంతో బొత్తిగా సెలవలు లేని నాకు మంచి అవకాశం.

తలుపు శబ్దం అయ్యింది. వెనక్కి తిరిగి చూశాను. మా బాస్ సుందరరావు వచ్చి కుర్చీలో కూలబడ్డాడు. "పని ఎంత వరకు వచ్చింది?" అడిగాడు. చెప్పాను.

తల ఊపి అడిగాడు "ఈ రోజునేనా ఊరువెడుతున్నది?" అని నా జవాబు కోసం ఎదురు చూడకుండా మళ్ళీ అడిగాడు "తిరిగి ఎప్పుడు వస్తున్నావమ్మా?" అని.

"సోమవారం నాటికి వచ్చేస్తాను. ఒక వేళ అత్యవసరంగా ఆగిపోవాల్సివస్తే మంగళవారం తప్పకుండా...." గొణిగాను. నాకుసెలవులు లేవని సుందర్రావుకి తెలుసు.

"అమ్మో! అంత పని చేయకమ్మా! నా ప్రాణాలు పీక్కుతింటాడు మన హెడ్డు. ఏమైనాసరే సోమవారం డ్యూటీలో జాయిన్ కావాలి. సరేనా?" ఆందోళనగా నా ముఖంలోకి చూశాడు సుందర్రావు.

నేను తల ఊపాను.

"మన హెడ్డులాంటి నిక్కచ్చి.దాదస్త్రం. మొండి. ఛంఠ. చవట. మూర్ఖముండావాడు మన ఇన్స్టిట్యూట్ మొత్తంమీద లేడమ్మా. ఓ సారేమైందంటే ..." ఊపిరి పీల్చుకోవటానికి ఆగాడు సుందర్రావు.

నేను స్టూలు ఆయన టేబులు దగ్గరికి లాక్కుని "చెప్పండి!" అన్నాను.

సిగరెట్ వెలిగించాడు సుందర్రావు. ఇంకో అగ్గిపుల్ల తీసి చెవిలో తిప్పుకుంటూ చెప్పసాగాడు "ఓ సారి ఆయన ఏవో కాయితాలో. ప్లోషీటో అతికించుకోవటానికి సెలోఫెన్ టేప్ తీశాడుట. దానిమీద అంగుళం వెడల్పు. మూడైపు అడుగుల పొడుగు అని వ్రాసి వుందట. వెంటనే స్కేలు తీసి ఆ టేప్ని పూర్తిగా విప్పదీసి కొలిచిగాని ఊరుకోలేదట. నిక్షేపంలాంటి టేప్నాశనం అయ్యిందన్న జ్ఞానంగాని. చేతులంతా బంక బంక అయ్యాయన్న సంకోచంగాని. తను చేయాల్సిన పని అది కాదన్న ఇంగితంగాని లేదుట మహానుభావుడికి!" సుందర్రావు నవ్వాడు.

నవ్వుతూనే గుర్తుకువచ్చి టైంచూశాను. లేచివెళ్ళి శాంపుల్ తీసి ఫ్రిజ్లో దాచాను. చేతులు కడుక్కోబోయి ఆగిపోయాను— థర్మోమీటర్లో మెర్క్యురీ తీయలేదని గుర్తుకు రావటంతో. బాటిల్ తీసుకువచ్చి థర్మోమీటర్లోని మెర్క్యురీ అందులోకి వొంపాను. అలా వొంపుతున్నప్పుడు ఓ చుక్క జర్రున జారి నా చేతి వేళ్ళ మీదుగా పాకి ఉంగరాన్ని మృదువుగా స్పృశించి కిందపడ్డది. ఉంగరం వంక చూశాను— పాదరసం తగలడంతో తెల్లగా అయ్యింది బంగారం. నేను సుందర్రావు వంక చూశాను. చెవిలో అగ్గిపుల్ల తిప్పుతున్నాడు. కర్ణాటక సంగీతం వింటున్న శ్రోతలా తన్మయత్వంతో! ఆయన చూసి వుంటే పాదరసాన్ని ఎలా హేండిల్ చేయాలో అయిదు నిముషాలు సుత్తి వేసేవాడు.

ఉంగరాన్ని పక్కనపెట్టి మిగతా పనులు పూర్తిచేశాను. ఆ తరువాత ఉంగరం సంగతి మరిచిపోయాను తొందరలో. ఇంకో ఇరవై నిముషాల తర్వాత బస్టాండ్లో నుంచుని వుండగా గుర్తుకు వచ్చింది ఉంగరం విషయం.

హడావిడిగా మా ఇన్స్టిట్యూట్ బిల్డింగ్ వేపు నడిచాను. సన్నగా చినుకులు. పడటంతో నడకని పరుగుగా మార్చాను. నేను కాంపౌండ్లో అడుగు పెట్టడమో. కరంటు పోవటమో ఏది ముందుగా జరిగిందో చెప్ప

లేను. ఆ సమయంలో నాకో విషయం స్ఫురించింది. మా ఇన్‌స్టిట్యూట్‌లో గదులన్నీ ప్రతి సాయంకాలం లాక్ చెయ్యడం, మళ్ళీ పొద్దున తెరవటం సెక్యూరిటీ వాళ్ళు చేస్తారట. నేనిప్పుడు తొందరపడకపోతే మా రూం లాక్ చేసే ప్రమాదం ఉంది — మా ఇన్‌స్టిట్యూట్ వదిలి అప్పుడే అర గంట అయ్యింది మరి.

తొందరతొందరగా బిల్డింగ్‌లోకి అడుగు పెట్టాను. అలవాటుగా లిఫ్టువైపు నడవబోయి కరంటులేదని గుర్తుకు రావటంతో మెట్లవేపు నడిచాను. మూడంతస్థుల మెట్లు పరిగెడుతూనే ఎక్కాను. ఆయాసపడుతూ మా గదిని సమీపించాను. ఇంకా మాగది లాక్ చెయ్యలేదు. గదిలోకి అడుగు పెట్టబోయి ఆగిపోయాను.

పగటిపూటకూడా రెండుజతల ట్యూబ్ లైట్ల వెలుగుకో పనిచెయ్యటం అలవాటు. చీకటివల్ల, నిశ్శబ్ద వాతావరణంవల్ల, ఒంటరితనంవల్ల ఎంతో పరిచయమైన ఆ గది అనిర్వచనీయమైన భయం కలిగిస్తున్నది. హోరున వీస్తున్న గాలి ఆ భయానక వాతావరణానికి బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌లా జతపడింది. నాకు నేనే ధైర్యం చెప్పుకుంటూ, తడుముకుంటూ లోపలికి నడిచాను. కుర్చీని, టేబుల్‌ని, స్టూల్‌ని పక్షపాతం లేకుండా గుద్దుకుంటూ. తొట్రుపడుతూ వర్క్‌బెంచ్ చేరానుఎలాగైతేనేం ఉంగరం ఎటుపెట్టానో ఊహించుకుని చేతిని అటు పాచాను. నా అంచనా తప్పు కాలేదు కాని. నాచెయ్యి వణకటంతో ఉంగరం కింద పడింది.

నన్ను నేనే తిట్టుకుంటూ ఒంగుని వెతకసాగాను. ఆ క్షణంలో నా కాలిమీద పాకుతున్నవి బొద్దింకలో, కాదో నాకు తెలియదు. నా చేతికి మెత్తగాతగులుతున్నది ఎలుకలు కాకూడదని ప్రార్థించుకుంటూ ఆ చీకటిలో వెతకసాగాను.

"టక్!" అని శబ్దం అయ్యింది.

నేను స్తంభించిపోయాను. నా గుండె కొట్టుకోవటం కొన్నిక్షణాలో, యుగాలో ఆగిపోయింది. నా నోటి నుంచి అరుపో, ఆర్తనాదమో రాకపోవటానికి కారణం నా మెదడు మొద్దుబారటం అయివుండాలి. ఎందుకంటే ఆ శబ్దం తలుపు మూయటం వల్ల పుట్టిందని, ఆ పనిచేసింది మా సెక్యూరిటీగార్డుఅని నాకు అవగతం అవటానికి దాదాపు రెండు నిముషాలు పుట్టింది.


వెంటనే దెబ్బతిన్న పులిలా, స్టార్టింగ్ షాట్ విన్న వంద మీటర్ల పరుగు పందెం అటగత్తెలా చేతులతో, కాళ్లతో నేలను తోస్తూ ఒక్క ఉదుటున లేస్తూ పరుగు పెడుతూ తలుపు వేపు వేగంగా కదిలాను. హర్డిల్స్‌లోలాగా గెంతితుంటే తలుపును చేరేదాన్నే కాని. మధ్యలో అడ్డుగా టేబుల్ ఉండటం గమనించకపోవటం వల్ల బలంగా దాన్ని ఢీకొట్టాను. తలకిందులవుతున్న టేబులు మీద నుంచి జారిపోతూ నన్ను నేనే సంబాళించుకోవాలని పక్కగా ఉన్న కుర్చీని పట్టుకోవడంతో అది కదిలి చెవి మీద బలంగా లాండ్ అయ్యింది. నా కళ్ళ ముందు లక్షల కోట్ల లక్షల ఫ్లాష్‌లు... చెవిలో మిలియన్ల కొద్దీ ఉరుములు పిడుగులు ...ఎంతో ఎత్తునించి అడుగులేని బావిలోకి పడిపోతున్న భావన..రెండు రాళ్ళ మధ్య కరకశంగా నలిగిపోతున్న స్పందన....

నేను తేరుకునేటప్పటికి మూడు నిముషాలకి పైగా పట్టింది. చెవిలోంచి రక్తం వస్తున్నదేమో అని చూడటానికి కుడిచెయ్యి పైకి లేపాను కలుక్కుమంది. టేబుల్‌ని కుడి భుజంతోనే పడతోశానాయె! ఎముక విరిగి వుండదు జస్ట్ బెణికి...(అబ్బా!)....ఉంటుందని నాకు నేనే సమాధానం చెప్పుకుని అతిమెల్లిగా జాగ్రత్తగా కదిలి తలుపును చేర లాగాను. తలుపు ఒక్క మిల్లీ మీటరు కూడా కదలలేదు!!

సెక్యూరిటీగార్డు పక్క గదులు లాక్ చేస్తుంటాడు. గట్టిగా అరిస్తే వినబడచ్చన్న అయిడియా వచ్చింది. ఊపిరి తిత్తులనిండా గాలి పీల్చుకున్నాను గట్టిగా అరవాలని. కాని ఆగిపోయాను. గొంతు పెగలక కాదు. అదే క్షణంలో మొదలైన పిడుగుల ఉరుముల పరంపరలో నేనే కాదు. వంద మంది ముక్తకంఠంతో అరిచినప్పటికీ అరడుగుల దూరం కూడా వినపడదు.

అయిదు నిముషాల క్రితం తలుపు లాక్ చేసిన గార్డు ఆ పాటికి నా అరుపులు వినబడనంత దూరంగా కిందకి వెళ్ళిపోయి ఉంటాడన్న విషయం తెలిసి రావటంతో ఉవ్వెత్తుగా దుఃఖం పొంగుకు వచ్చింది నాకు. కాళ్ళు బలహీనంగా వణికాయి. నిస్సత్తువగా తలుపుకి ఆనుకుని కూలబడిపోయాను.

* * * *




మా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ది మూడు అంతస్తుల భవనం. దాదాపు రెండు వందల గజాల పొడుగు వుంటుంది. మా రూం మూడవ అంతస్తులో ఈ చివరిగా ఉంది. సెలవు దినాల్లో అసలు మనుష్య సంచారం ఉండదు. ఒక్క సెక్యూరిటీగార్డ్సు తప్ప. వాళ్ళయినా రిసెప్షన్ కౌంటర్‌దగ్గర, సెక్యూరిటీ గేటులవద్ద వుంటారు. రిసెప్షన్ కౌంటర్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆ చివరగా వుంది. ఇప్పుడు వరుసగా నాలుగు రోజులు సెలవులు. అంటే మనుష్య సాయానికి, నాకు మధ్య రెండు వందల గజాల దూరం. నలభై అడుగుల యెడం. వంద గంటల ఆలస్యం వున్నాయన్న మాట ఇప్పుడు నేనున్న పరిస్థితుల్లో అవే లక్షల మైళ్ళ దూరంలో, యుగాల అంతరాలుగా నన్ను భయపెడుతున్నాయి.

రిసెప్షన్ కౌంటర్ దగ్గర సెక్యూరిటీగార్డ్సు ఏం చేస్తుంటారు? ఎమర్జెన్సీ పవర్ సప్లయి వల్ల వాళ్ళకి చీకటి పీడ వుండకపోవచ్చు. అందువల్ల చక్కగా టీలు తాగుతూ, టెలిఫోను చేసుకుంటూ.... నా ఆలోచనలు ఆగిపోయాయి. ఒదిగిపోయి నా తలని మోకాళ్ళ మీద ఆన్చిన నా నడుం నిటారుగా అయిపోయింది... అవును ... టెలిఫోన్....

మా బిల్డింగ్‌లో ప్రతి రూంలో ఇంటర్నల్ టెలిఫోన్స్ వున్నాయి. రిసెప్షన్ కౌంటర్ వద్ద, సెక్యూరిటీ గేట్ వద్ద కూడా వున్నాయి అవి. ఇక్కడి నుంచి ఎవరికయినా ఫోన్ చేస్తే నేను బయటపడటానికి రెండు క్షణాలు చాలు.

అనవసరంగా బెంబేలు పడిపోయినందుకు, గదిలో ఖయిదీనయిపోయానని కంగారుపడినందుకు నన్ను నేనే "యూ సిల్లీ ఇడియట్!" అని తిట్టుకుంటూ టెలిఫోన్ వెతకసాగాను. ఇందాకటి "టేబుల్‌తో నా భేటీ" వల్ల టెలిఫోన్ కిందపడిపోయి వుంటుంది.... రిసీవర్ దొరికింది.... యిదిగో సెట్.... అమ్మయ్య! రిసెప్షన్ కౌంటర్ నంబరు ఎంత?.... 411 కదూ! రిసీవర్ చెవికి దగ్గరగా చేర్చాను.... నిశ్శబ్దం ... డయల్‌టోన్ సరిగా వినలేకపోతున్నానేమో అని రిసీవర్‌ని చెవికి ఇంకా దగ్గరగా ఒత్తాను.... నిశ్శబ్దం.... ఆ గదిలో.... నా కనుచూపు మేరలో.... నాకు అందుబాటులో ఉన్నంత మేరా విస్తరించుకున్న నిశ్శబ్దం ఆ రిసీవర్ నుంచి ప్రవహిస్తూ నాలో మిణుకు మిణుకుమంటున్న ఆశా దీపాన్ని ఆర్పేసింది.

నా చేతిలో నుంచి రిసీవర్ కిందపడ్డది. జారిపోయి— నిశ్శబ్దానికి ఫుల్‌స్టాప్ పెడుతున్నట్లు ఠప్‌మని చప్పుడు చేసింది. నేను శిలలా, ఊపిరి పీల్చటం నేర్చుకున్న శిల్పంలా కదలక మెదలక ఉండిపోయాను.


ఓ మెరుపు మెరిసింది.... పిడుగుపడటంతో ఉలిక్కిపడ్డాను. తర్వాత యింకో

మెరుపు....గదినంతా వెలుగుతో నింపిన మెరుపు....ఆ వెలుగులో క్షణంలో వెయ్యో వంతు మాత్రమే ఉన్న ఆవెలుగులో నేనో విషయం గమనించాను — రిసీవర్‌ని సెట్‌కి కలిపే వైర్ సగానికిపైగాతెగిపోయింది.... అంటే ఆ తీగెని సరిగ్గాఅతికితే నేను బయట ప్రపంచంతో సంబంధం ఏర్పరుచుకో వచ్చన్న మాట. కాని ఈ చీకట్లో ఆ పని నేను చేయగలనా? ఏమీ అర్థంకాని అయోమయ గజిబిజి స్థితిలో ఉన్న నేను యిది సాధించగలనా? సాధించలేకపోతే ఒంటరి తనమే తోడుగా తిండితిప్పలు లేకుండా నాలుగురోజులు గడపాల్సివస్తుంది.

'సాధించగలను! సాధించగలను!' అని మొండిగా అనుకున్నాను. ఈత రానివాడిని నడిసముద్రంలో పడేస్తే ఈత నేర్చుకుంటాడన్న మాట నిజమనిపించింది ఆ క్షణాన. కొంత ధైర్యంతో. ఇంకొంచెం స్థిర చిత్తంతో ఆలోచించటం మొదలుపెట్టాను.

ముందుగా నాకు తోడు.... అదే వెలుగు కావాలి సుందర్రావు టేబుల్ మీద సిగరెట్ పెట్టె. అగ్గిపెట్టె వుంటాయి !! ఒక్క ఉదుటున లేచిన నేను గతాన్ని గుర్తుచేసుకుని తొందరపాటుతగ్గించి మెల్లగాతడుముకుంటూ నడిచాను....తడుముతున్న చేతికి సిగరెట్ పాకెట్ తగిలింది....పక్కన ఏమిటది? అగ్గిపెట్టేనా?....అవును అగ్గిపెట్టే!... వణుకుతున్న చేతులతో పెట్టెతెరిచి చూశాను....ఖాళీ!!....నేను ఆ బందిఖానా నుంచి తప్పించుకునే అవకాశాలు లాగానే. నా బుర్రలో ఉపయోగపడే ఆలోచనలు లాగానే ఖాళీ!....విరక్తితో.కోపంతో.కసితో. సెల్ఫ్ పిటీతో నా దురదృష్టానికి నన్ను నేనే నిందించుకుంటూ ఆ పెట్టెని కిటికీవేపు గట్టిగా విసిరాను. వెన్వెంటనే నాకో విషయం గుర్తుకు వచ్చింది....సుందర్రావు చెవిలో తిప్పుకునేందుకు చాలా అగ్గిపుల్లలు వాడతాడు....రూంలో వెదికితే అవి దొరకక పోవు....మరి అగ్గిపెట్టో? నా చేతులలో వున్న అగ్గిపెట్టెని పారేశానాయె! ఇందాక






పుల్లలులేని పెట్టె! ఇప్పుడు పెట్టెలేనిపుల్లలు! చేదుగా నవ్వుకున్నాను.

కిటికీ దగ్గరగా నేలమీద తడుము తున్నప్పుడు అగ్గిపెట్టె దొరకటంతో నా గురి తప్పినందుకు సంతోషించాను. గది నాలుగుమూలలా వెతికితే పదివరకూ అగ్గి పుల్లలు దొరికాయి.

ఇప్పుడు కావాల్సింది ఓ దీపం। గదిలో చాలా కెమికల్సు. సాల్వెంట్సు ఉన్నాయి. వాటిని ఉపయోగించి వెలుగును సాధించాలి. ఎలా? నా మనసు ఉరకలు వేసింది. బాటిల్ కి ఉండే మూతకి చిల్లుపెట్టి. రుమాలును ఒత్తిగా ఉపయోగించవచ్చు.... బాగానే ఉంటుంది. కాని ఈథర్. బెంజిన్ లాంటి సాల్వెంట్స్ ఎంతో ప్రమాదకరమైనవి. వాటిని నాటుగా మోటుగా చేసిన దీపాలలో వాడితే ప్రేలుడు సంభవించే ప్రమాదం ఉంది. మరి దీపాన్ని వెలిగించటం ఎలా?.. నీళ్లు దొరకని ఎడారిలో కన్నీళ్ళైనా తాగి బతకాలట.... ఇప్పుడు నా బియస్సీ పరిజ్ఞానాన్ని. నా రెండేళ్ల అనుభవాన్ని ఉపయోగించి ఓ పద్ధతి కనుక్కోవాలి।

కళ్ళు మిరుమిట్లు గొలిపేలా ఓ మెరుపు మెరిసింది.... అయిడియా! ఆల్కహాలులో నీళ్ళు కలిపి దాన్ని ఇంధనంగా వాడితే!! అవును! నీళ్ళు కలపటం వల్ల ఆల్కహాలు నిరపాయకరంగా మారుతుంది.

రేకు మూతకి హెయిర్ పిన్నుతో చిల్లు చేయటం. రుమాలును సగం చేసి ఒత్తి చేయటం రెండు నిముషాలలో చేశాను. ఇంకో నిముషం తరువాత గది అంతా వెలుగుతో పరుచుకుంది.

దీపాన్ని వెలిగించిన ఉత్సాహం టెలిఫోన్ పరిస్థితి చూసేటప్పటికి చల్లారింది. సెట్ పగిలిపోయి ఉంది.... తెగిపోయిన కార్డ్ని అతికించినా ఏం ప్రయోజనం ఉండదు.

నిరాశా వలయంలోకి జారిపోబోతూ చివరిక్షణంలో నిలదొక్కుకున్నాను. నిరాశా నిస్పృహలతో గడపటానికి ఇంకా నాలుగు రోజుల అవకాశం వుంది। కాబట్టి ఆ పని వాయిదా వేసి కూల్ గా ఆలోచించటం ప్రారంభించాను.

ఇప్పుడు కరంటు లేదుగాని కొంత సేపటికి కరంటు రావచ్చు. వస్తే?....నాకు అదనంగా వచ్చే సౌకర్యంలేదు.

ఇంకో పది పన్నెండు గంటలలో తెల్లవారుతుంది. తెల్లవారితే ...?.... ఏం లాభం? మా కిటికీలోంచి కనబడే దృశ్యాలని తలచుకోగానే మళ్ళీ నిరాశ పుట్టింది. కిటికీలోంచి కనబడే దట్టమైన పొదలమధ్య. చెట్ల మధ్య నరమానవుడు తిరగటం నా రెండేళ్ళ అనుభవంలో నేను గమనించ లేదు.

జారిపోతున్న స్థైర్యాన్ని నిలదొక్కుకుంటూ ఆలోచించసాగాను. నేను తప్పించుకోవటానికి రెండే మార్గాలు. ఒకటి కిటికీ, రెండోది తలుపు....తలుపును బద్దలుకొడితే కిటికీలోంచి బయటకి జారితే అప్పుడే నాకు విముక్తి!

ఆలోచిస్తే తలుపు బద్దలుకొట్టడమే బాగుందనిపించింది. సరే! ఎలా బద్దలు కొట్టాలి?.... టేబుల్ ని తోసుకొంటూ వెళ్ళి తలుపును ఢీకొడితే ??....వండ్రఫుల్!.... తలుపు అప్పడంముక్కలా విరిగిపోతుంది.

చెయ్యటంకంటే అనుకోవటం ఎంత సులభమో టేబుల్ ని తోస్తుంటే తెలిసింది. ఆలోచనలలో తేలికగా కనబడినవి ఆచరణలో ఎంత క్లిష్టంగా మారుతాయో తలుపును టేబుల్ తో ఢీకొడుతుంటే తెలిసింది. టేబుల్ ని తొయ్యడానికే నా బలమంతా ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. దాంతో టేబుల్ వెళ్ళి జస్ట్ తలుపును అలా మృదువుగా స్పృశిస్తున్నది. అంతే!....ఎలా మరి?.... అవునూ నేలమీద గ్లిజరిన్ పోస్తే నేల జారుడుగా అవుతుందికదా! ఫ్రిక్షన్ లేకపోవటంతో టేబుల్ సులభంగా జరిగి తలుపును బలంగా ఢీకొట్టచ్చు!! 'ఓహో! రేఖా! నీ బుర్ర పాదరసంలా పనిచేస్తున్నది', నన్ను నేనే మెచ్చుకున్నాను. (డర్టీ పాదరసం! దానివల్లనే కదా ఇన్ని తిప్పలు!)

రెండు గ్లిజరిన్ బాటిల్స్ ధారాళంగా నేల మీద ఒంపాను. మళ్ళీ ప్రయత్నించాను. బల్ల ఎంత సులువుగా కదులుతున్నదో అంత బలంగా తలుపును తగులుతున్నది. అయిదో ప్రయత్నంలో అనుకుంటాను "ఫెళ ... ఫెళ ... ఫెళ ..." అనికర్రవిరిగిన చప్పుడు వినబడింది. ఇనుమడించిన ఉత్సాహంతో మరింత శక్తిని ఉపయోగించి తోశాను.

ఫెళ.... ఫెళ.... అన్నది తలుపుకాక టేబులు కాళ్లు అవటంతో కాళ్ళు విరిగిన టేబులు నా కాళ్ళ మీద పడింది. దాంతో గ్లిజరిన్ తో తడిసిన నేల మీద స్కేటింగ్ చేస్తున్నట్లు జారి తలతో విసురుగా తలుపును కొట్టాను. అప్పుడు తెలిసింది తలుపు ఎంత బలంగా ఉందో!

తల దిమ్మెక్కి రెండు నిముషాలు కదలలేక పోయాను. ముక్కునుంచి కారుతున్న రక్తాన్ని షర్టుతో తుడుచుకుంటూ కూర్చున్నాను. తరువాత లేద్దామని ప్రయత్నిస్తుంటే ఓ చిత్రమైన విషయం అనుభవంలోకి వచ్చింది.... టేబుల్ కింద నలుగుతున్న నా కాలు నాది కాదన్నట్లు స్పర్శలేకుండా ఒక చిత్రమైన భంగిమలో వుంది. శ్రమపడి టేబుల్ ని కాలుమీద నుంచి తోసేశాను. ఒక్కసారిగా బాధ ఉవ్వెత్తున లావాలాగా పొంగుకు రావడంతో తట్టుకోలేక ఒణికిపోయాను. ఎంతో కష్టపడి లేచి నుంచున్నాను. కాలు నేలమీద ఆన్చితే విలవిలలాడిపోతున్నాను. చేతి విషయంలో ఇంకా అనుమానం వుందిగాని కాలుమాత్రం నిక్కచ్చిగా మడమ దగ్గర ఫ్రాక్చర్ అయ్యింది.

రెండు స్కేళ్ళని విరిచి ఆ ముక్కలతో, నాపికిన్ లతో కాలును సెట్ చేశాక బాధ కొంత తగ్గింది గాని కాలును నేలమీద ఆన్చలేకపోతున్నాను.

సో. తలుపును విరగ్గొట్టబోయి కాలు విరగ్గొట్టుకున్నానన్నమాట!

ఇక మిగిలింది కిటికీ! కిటికీలోంచి నేల మీదికి నలభై యాభై అడుగుల ఎత్తు వుంటుంది. అంత పొడుగు వున్న బలమైన తాడో తీగో సంపాదించాలి.... చుట్టూ చూశాను.... కన్ సీల్డ్ ఎలక్ట్రిక్ వైరింగ్..


లాభం లేదు.... టెలిఫోన్‌కి రెండు మూరల కంటే ఎక్కువ లేదు.... నిరుపయోగం.... అసలు నాదే తప్పు! వర్కింగ్ విమెన్‌కి పాంటు షర్టు. ఎంతో సౌకర్యంగా వుంటాయన్న అభిప్రాయంతో ఇన్‌స్టిట్యూట్‌కి చీర కట్టుకురాని నన్ను నేనే తిట్టుకున్నాను. చీర వుంటే దాన్ని నిలువుగా రెండు ముక్కలుచేసి కలిపితే ముప్పై అయిదు అడుగుల పొడుగు వుండేది. దాంతో కిందకి జారేదాన్ని!.... కాని లంగా జాకెట్టుతో మళయాళం సినిమా హీరోయిన్ లాగా ఎవరికంటనన్నాపడితే క్షేమంగా ఇంటికి చేరేదాన్నా? రోజూ పేపర్‌లో చదివే రేప్ వార్తలు గుర్తుకు రావటంతో అంతా మనమంచికే అనుకున్నాను.

మరి తక్షణ కర్తవ్యం? ఏమీ లేదు!.... బయటనుంచి సాయం వస్తుందేమో అన్న ఆశతో ఎదురు చూడటం....బయటనుంచి సాయమా?....నాకు నవ్వు వచ్చింది....వికారంగా నవ్వుకున్నాను....బయటనుంచి సాయం రావటంకంటే నాకు నోబెల్ బహుమానం రావటానికే అవకాశాలు ఎక్కువ. ఇప్పుడు నాకున్నసాయం.... ఒక్క నేనే!

నాలుగు రోజులు ఓపికగా గడిపితేగాని విముక్తిలేదు కదా! నాలుగు పవళ్ళు, అయిదు రాత్రులు గడపాల్సిందేనా ఈ బందిఖానాలో? తిండిలేని. తోడులేని పిచ్చి ఎక్కించే పగళ్ళు. క్షణం క్షణం భయంతో ప్రాణాలు పిండేసే రాత్రుళ్ళు గడపగలనా? ఈ మధ్యలోనే చచ్చిపోతానేమో!. నాకు ఎన్నేళ్ళు? ...ఇరవై అయిదేళ్ళ రెండునెలల చిల్లరకదా!....అప్పుడేచావా?. ఒక విధంగా చచ్చిపోతే బతికిపోతానేమో.. ఏడుపురాని ఈ దైన్యంలో. ఎంతో చేయాల్సి ఏమీ చేయలేని ఈ అసహాయ స్థితిలో. జుట్టు పీక్కోవాలనిపించే ఈ ఉన్మాదంలో. ఏమీ కలిసిరాని అన్నీ ఎదురు తిరిగే ఈ విషమ వలయంలో. తల తిరిగిపోతున్న ఈ ఉన్మత్త పరిస్థితిలో. దారితోచని ఈ పద్మవ్యూహంలో నాకు పిచ్చి ఎక్కటానికి ఒక్కరాత్రి చాలు.... అలా పిచ్చిదాన్ని అయిపోవడం కంటే చావటం నయంకదా! చావును ఆహ్వానించడంకోసమో పిచ్చి ఆవరించటంవల్లనో నా తలని పడిపోయిన టేబుల్‌కి వేసి కొట్టుకోసాగాను.

అలసిపోయి సొమ్మసిల్లి టేబుల్ మీద వాలిపోయాను. నాకున్న ఒకేఒకసాయాన్ని పోగొట్టుకుంటున్నాననిపించింది. కంట్రోలు తప్పిపోయి నాకు నేనే హాని చేసుకుంటున్నాను.

లేచి కుంటు కుంటూ వెళ్లి ప్రతి వస్తువును పరీక్షించి చూడసాగాను. "కాదేదీ తప్పించుకోవటానికి అనర్హం" అన్నట్లుగా.




అంతేకాదు తద్వారా పిచ్చి పిచ్చి ఆలోచనల నుంచి తప్పించుకోవచ్చని.

సుందరరావు బీరువా తీసిచూశాను.... పుస్తకాలు....కాయితాలు....ఫైళ్లు. నాలుగు ఇంకు బాటిళ్లు. ఎనిమిదో తొమ్మిదో సెలోఫెన్ టేపులు. గుండుసూదుల పాకెట్లు. గమ్‌బాటిలు....ఇత్యాదులు! విసురుగా బీరువా మూశాను.

వర్క్‌బెంచ్ మీద.... కెమికల్స్.... బ్యూరెట్లు. పిపెట్లు. కోనికల్ ఫ్లాస్కులు... ఇంకా....ఇంకా....

మళ్ళీ నిరాశ ఆవరించింది"....చీకటిలో నాగదిలో.... నా మదిలోపలి గదిలోపలి చీకటిలో...." అంటూ అస్పష్టంగా. అస్తవ్యస్తంగా శ్రీశ్రీ గీతాన్ని పాడుకుంటూ కూలబడ్డాను. అప్పుడు ఆకలిగా అనిపించటంతో టైం చూసుకున్నాను.... 10 గంటలు.... ఈ పాటికి మా ఊరి బస్సు బయల్దేరి ఉంటుంది.

ఈ గది పొడవు ముప్పై అడుగులు. వెడల్పు ఇరవై. ఎత్తు పదిహేను.... ఇంత పెద్ద గదిలో నాకు కావాల్సిన నలభై అడుగుల పొడుగున్న బలమైన తాడు దొరకలేదు.... అడుగులు.... నలభై అడుగులు ....ఇందాక సుందర్రావు ఏదో చెప్పాడు కదా!!

ఒలింపిక్ ఆటల్లో కాళ్ళు ఫ్రాక్చర్ అయిన వారికి పరుగు పందెం పెడితే గోల్డ్ మెడల్ తప్పక వస్తుందన్న ధీమా నాకు కలిగింది- నేను సుందర్రావు బీరువాని చేరిన వేగాన్ని గమనించాక. ఆయాసపడ్తూ ఆతృతగా ఆశగా. హడావిడిగా బీరువా తీసి సెలోఫెన్ టేపులు లెక్కపెట్టాను. ఎనిమిది వున్నాయి. ఒక్కొక్కటి ముప్పై అడుగుల పొడుగు....నాలుగు కలిపి పేనితే బలమైన తాడు అవుతుంది....దానికి ఇంకోటి కలిపితే మొత్తం అరవై అడుగుల పొడుగు... పోన్లే ఎంత లేదన్నా యాభై అడుగుల పొడుగు....అదిచాలు నాకు....అదిచాలు....

కాని...నన్ను.... నా నలభై అయిదు కిలోల శరీరాన్ని ఆపగలదా ఆ తాడు....? పరీక్షించాలి.

పదిలీటర్ల జెర్రికాన్ నిండా నీళ్ళు నింపాను-అంటే పది కిలోల బరువన్న మాట....హాండిల్ ద్వారా ఒక సెలోఫెన్ టేపుపోనించి ఎత్తటానికి ప్రయత్నించాను. బరువుగా ఉంది. పళ్ళ బిగువున లేపాను. ఒకటి. రెండు. మూడు నిముషాలు ఏ ప్రమాదం లేకుండా పది కిలోల బరువును సెలోఫెన్ టేప్ పట్టుకున్నపుడు నా గుండెలు దద్దరిల్లేలా. గొంతు నొప్పి కలిగేలా. చెవులు గింగుర్లుమనేలా "యురేకా!" అని అరిచాను.

ఆ టేపులు అల్లటం మొదలుపెట్టాను.

* * *

ఇంకో నాలుగు గంటల తర్వాత కిందకి చేరాను. అల్లటానికే మూడున్నర గంటలు పట్టింది. ఇంకో పావుగంట ధైర్యం తెచ్చుకొనటంలో గడిపాను. దిగటానికి పావు గంట కాలం, రెండు పళ్లు, నాలుగు ఔన్సుల రక్తం వెచ్చించాను— జర్రున జారినప్పుడు సన్‌షేడ్ తగిలింది. ఓ సెక్యూరిటీ గార్డు సాయంతో ఇల్లు చేరాను. ఆతర్వాత గుర్తుకు వచ్చిన ఓ విషయం. తెలిసిన సమాచారం నన్ను నేనే. 'యూ రేఖా! యూ ఆరే ఫూల్!' అనుకునేట్లు చేశాయి

గుర్తుకు వచ్చిన విషయం— ఉంగరాన్ని గదిలోనే మరచిపోయి దిగాను.

తెలిసిన సమాచారం—ఆ రోజు నించి మా బిల్డింగ్‌కి సున్నాలు వేస్తున్నారని. అందుకని మాగది తలుపులు పొద్దున 8 గంటలకి తెరిచేవారని.